ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపికైన

విద్యార్థులు సిద్ధం కావాలి

కామారెడ్డి, డిసెంబర్ 29 : గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జీవోఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా 2022-23 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో 74 మంది విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డులు మనక్ స్కీంకు ఎంపికైనట్లు డీఈవో రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 74 మంది విద్యార్థులు డైరెక్ట ర్ ఎస్‌సీఈఆర్‌టీ, టీఎస్ ఆదేశానుసారం ఇన్‌స్పైర్ మనక్ కాంపిటిషన్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో జిల్లా స్థాయి ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారి బ్యాంకు ఖాతాలో అవార్డు ప్రదర్శన డబ్బులు రూ.10 వేలు జమ అయినట్లు తెలిపారు. జిల్లా స్థాయి ఈ-డీఎల్‌ఈపీసీలు, రాష్ట్ర స్థాయి ఈ-ఎస్ ఎల్‌ఈపీసీ ఆన్‌లైన్‌లో నిర్వహించడం కోసం ఎన్ఐఎఫ్, గుజరాత్ ద్వారా సాంకేతిక మద్దతు అందిస్తుందని తెలిపారు. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్పైర్ మనక్ కాంపిటిషన్ యాప్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలకు

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, డిసెంబర్ 29 : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గురుకులాల సమన్వయకర్త సంపత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు http://tgcet. cgg.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు. వచ్చే జనవరి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 29 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాల కోసం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన' దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా ప్రజల నుంచి అధికారులు దరఖాస్తుల ను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

రెండో రోజు 33,854 దరఖాస్తులు స్వీకరణ

కామారెడ్డి, డిసెంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండో రోజు జిల్లా వ్యాప్తంగా 61 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డుల్లో 33,854 దరఖాస్తులు స్వీకరించారు. చాలా చోట్ల ప్రజలు ఫారాలు లేక జిరాక్స్ కాపీలను అందజేశారు. కొన్ని చోట్ల ఫారాలు లేక వెనుదిరిగి వెళ్లారు.

'ప్రజా పాలన'ను సందర్శించిన అదనపు కలెక్టర్లు

రాజంపేట, భిక్కనూరులో ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు చంద్రమోహన్, మను చౌదరి సందర్శించారు. దరఖాస్తుకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. దరఖాస్తుల వివరాలను కౌంటర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్య, ఎం పీడీవోలు బాలకిషన్, అనంతరావు, సర్పంచ్ తునికి వేణు తదితరులు పాల్గొన్నారు.

మాందాపూర్‌లో దరఖాస్తులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, నాయకులు

బాన్సువాడ మండలం దేశాయిపేట్, హన్మాజీపేట్ గ్రామాల్లో ప్రజా పాలన కౌంటర్లను బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు సందర్శించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నోడల్ అధికారులు తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో సత్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు బోనాల సుభాష్, శ్రావణ్‌కుమార్, భాస్కర్, కొమ్నిబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో అధికారులు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. నస్రుల్లాబాద్ మండలంలోని సంగం గ్రామం లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆర్డీవో భుజంగరావ్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు రాజు, జనార్దన్, ఎంపీడీవోలు సుబ్రహ్మణ్యం, భాను ప్రకా శ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామాన్ని ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఉచితంగానే దరఖాస్తులు ఇస్తారని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో బాలకృష్ణ తదితరులు ఉన్నారు. దోమకొండతోపాటు ముత్యంపేట్, అంబారీపేట్, బీబీపేట మండలం మాందాపూర్ గ్రామాల్లో ప్రజా పాలన దరఖాస్తులను లబ్ధిదారులు అధికారులకు అందజేశారు. గాంధారి మండలంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సర్వాపూర్‌లో దరఖాస్తుల స్వీకరణను డీపీవో శ్రీనివాస్ పర్యవేక్షించారు. తహసీల్దార్ జానకీ, ఎంపీడీవో సతీశ్, ఎంపీవో రాజ్‌కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు. పిట్లం మండలంలోని తిమ్మనగర్‌లో సర్పంచ్ అనిత అధ్యక్షతన నిర్వహించిన ప్రజా పాలనలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీవో బ్రహ్మం పాల్గొన్ని అభయహస్తంపై అవగాహన కల్పించారు. మద్నూర్ మండలంలోని చిన్న ఎక్లారా గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలనలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, తహసీల్దార్ ముజీబ్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. డోంగ్లీ మండలంలోని మొఘ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రేణుకా చౌహాన్, సర్పంచ్ సూర్యకాంత్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని రెడ్డిపేటలో ఎంపీడీవో సవితారెడ్డి, జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి పాల్గొని.. ప్రజలు దళారులను నమ్మి మోసపోవొద్దని సూచించారు. బిచ్కుంద మండలంలోని వాజిద్‌నగర్‌లో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణను డీపీవో శ్రీనివాస్, బిచ్కుందలో జడ్పీ సీఈవో సాయాగౌడ్ పరిశీలించారు. ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో మహబూబ్, సర్పంచ్ అనూయ పాల్గొన్నారు.

రాజంపేటలో అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

భిక్కనూరులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మనూచౌదరి

సర్వాపూర్‌లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

వైభవంగా శ్రీసరస్వతీ

మహాక్షేత్ర వార్షికోత్సవం

పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

కామారెడ్డి, డిసెంబర్ 29 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ (అడ్లూర్)లో ఉన్న శ్రీసరస్వతీ మహాక్షేత్రం సప్తమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రధాన దేవతలకు పంచామృతాభిషేకాలు, అలంకారం, కలశ ప్రతిష్ఠ, నవగ్రహారాధన, సామూహిక కుంకుమార్చనలు, అక్షరాభ్యాసం, ఒడి బియ్యం, తీర్థప్రసాదాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం

అధికారులు కృషి చేయాలి

మాట్లాడుతున్న విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్

కామారెడ్డి, డిసెంబర్ 29 : దివ్యాంగుల సంక్షేమం కోసం అధికారులు కృషి చేయాలని విజ్ఞాన్ దివ్యాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా పాలన కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కృషి చేయాలని కోరారు. ప్రజా పాలన కార్యక్రమంలో అన్ని సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమం గడువు పెంచాలని కోరారు. దివ్యాంగులకు ప్రత్యేక కాలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, సబ్ కమిటీ డైరెక్టర్ గాడి నర్సింహులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గణపతి, సుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ప్రారంభమైన

అయ్యప్ప మండల పూజా మహోత్సవాలు

కామారెడ్డి, డిసెంబర్ 29 : జిల్లా కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో ఉన్న అయ్యప్ప ఆలయంలో మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం అయ్యప్ప స్వామి దేవాలయ 34 వ మండల పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కన్నయ్య, రుత్విక్కులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి హోమం, అష్టాభిషేకం, పుణ్యాహవాచనం, గోపూజ, మహాగణపతి, సుదర్శన హోమం, మూల మంత్రం, విశేష అభిషేకాలు, మధ్యాహ్నం పడి హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. సాయంత్రం దీపాలంకరణ పూజ, పుష్పాభిషేకం, శివపార్వతి కల్యాణం, భగవతి సేవ, కుంకుమ పూజ, భజన, రాజోపచార తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం కార్యనిర్వహణ అధ్యక్షుడు పట్నం రమేశ్, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్, అన్నదాన సమితి అధ్యక్షుడు నస్కంటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగుతున్న అయ్యప్ప స్వామి శరణుఘోష

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: పడిపూజలతో గ్రామాల్లో అయ్యప్పనామం మార్మోగుతున్నది. ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం వేద పండితుడు శివకుమార్ శర్మ, గురుస్వామి హనుమంతప్ప ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజను వైదిక పద్ధతిలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం పద్దెనిమిది మెట్లను రాగయుక్తంగా పాటపాడుతూ వెలిగించారు. రాజంపేట్ నుంచి వచ్చిన భజన బృందం సభ్యులు ఆలపించిన అయ్యప్ప పాటలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో మాలధారుడు ఓర శ్రీనివాస్, ఎల్లారెడ్డి, లింగంపేట్, తాండూర్‌కు చెందిన మాలధారులు, పట్టణానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

అభిషేకం నిర్వహిస్తున్న మాలధారుడు

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

మందులను పంపిణీ చేస్తున్న పశువైద్య సహాయ సంచాలకుడు సుభాష్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: మండలంలోని సాతెల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పశువులను పరీక్షించి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. పశువైద్య సహాయ సంచాలకుడు సుభాష్.. పశువుల యజమానులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. చలికాలంలో పశువులు ఎదకు వస్తే గమనించి దగ్గరలో ఉన్న గోపాలమిత్రలకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సకాలంలో గర్భధారణ చేయిస్తే మేలు జాతి దూడలు జన్మిస్తాయని తెలిపారు. శిబిరంలో 32 పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ టీకాలు, 17 పశువులకు సాధారణ చికిత్సలు, నాలుగు పశువులకు కృత్రిమ గర్భధారణ, 32 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరుడి సంగయ్య, ఉపసర్పంచ్ నాగరాజు, మండల పశువైద్యాధికారిణి అర్చన, జేవీవో ఆంజనేయులు, ఓఎస్‌లు రమేశ్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాలమిత్రలు మహబూబ్, సాయి రెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లో నిర్వహించిన శోభాయాత్ర

ఎల్లారెడ్డిలో శోభాయాత్రకు స్వాగతం పలుకుతున్న భక్తులు

వైభవంగా అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర

అయోధ్య పూజిత అక్షింతల శోభాయాత్ర వైభవంగా కొనసాగుతున్నది. ఎల్లారెడ్డిలో పెద్ద ఎత్తున కార్ల ర్యాలీని రామాలయం నుంచి గండిమాసానిపేట్ వరకు నిర్వహించారు. మాసానిపేట్ నుంచి అయోధ్య రామాలయ అక్షింతల రథానికి స్వాగతం పలుకుతూ శోభాయాత్రగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. మహిళలు దారిపొడువునా మంగళహారతులతో స్వాగతం పలికారు. శోభాయాత్రలో పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, ప్రజలు, మహిళలు, పిల్లలు నృత్యాలు, కోలాటం, ఆటపాటలతో పాల్గొన్నారు. చిన్నారుల వేషధారణ ఆకట్టుకున్నది. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అక్షింతల కలశాలను భద్రపరచారు. నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవుపల్లి క్రాస్‌రోడ్డు నుంచి శ్రీరామాలయం వరకు భక్తులు శోభాయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల, భజనలు, వార్కరీల కీర్తనల మధ్య శోభాయాత్ర కొనసాగింది.

-ఎల్లారెడ్డి రూరల్/ నస్రుల్లాబాద్, డిసెంబర్ 29

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

పిట్లం, డిసెంబర్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో దేవీసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనాన్ని రుచికరంగా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయుడు గణేశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలికి సూచనలు ఇస్తున్న ఎంఈవో

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SAMBARI LAVANYA, W/o. Sambari Mohan, R/o. 5-67/1, Nallavelly, Indalwai, Nizamabad, TS. Changed My Name as SAMBARI PRAMEELA, W/o. Sambari Mohan.
NT-324499

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పిట్లంలో నేత్రవైద్య శిబిరం

పిట్లం, డిసెంబర్ 29: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు హరికిషన్‌రావు మొత్తం 68 మందిని పరీక్షించారు. 17మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి బోధన్‌లోని లయన్స్ కంటి దవాఖానకు ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు చంద్రశేఖర్, వేణుగోపాల్, కొంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు దుర్మరణం

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 29: మండలంలోని జగన్నాథ్‌పల్లి వద్ద జాతీయ రహదారి 161పై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన ఒడ్డింటి గంగవ్వ(70) కుమారుడు పోశబోయి పొలం పని ముగించుకొని మోపెడ్‌పై ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టడంతో గంగవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. పోశబోయికి గాయాలు కాగా.. దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బడిబయటి చిన్నారుల గుర్తింపు

రామారెడ్డి, డిసెంబర్ 29: మండలంలోని గిద్ద గ్రామంలో విద్యాశాఖ అధికారులు బడిబయటి విద్యార్థుల కోసం శుక్రవారం సర్వే నిర్వహించారు. గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు బడీడు పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు క్లస్టర్ సీఆర్పీ మహమూద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. చిన్నారులను స్థానిక స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కన్నయ్య, ఉపాధ్యాయులు నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఆర్పీ మహమూద్

'అభయహస్తం' దరఖాస్తులను విక్రయిస్తే కఠిన చర్యలు

ఎల్లారెడ్డి, డిసెంబర్ 29: మీ సేవ నిర్వాహకులు, జిరాక్స్ సెంటర్లు, ప్రైవేటు వ్యాపారులు ఎవరైనా ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి బల్దియా కమిషనర్ జగ్జీవన్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో ఏర్పాటు చేసిన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. దరఖాస్తు ఫారాలు లభించడం కొందరు పుకార్లు సృష్టించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు డబ్బులు వెచ్చించి దరఖాస్తులు కొనవద్దని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రజలకు సరిపడా దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ఇండ్ల వద్దకే వచ్చి దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు. దరఖాస్తులు విక్రయించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

రామారెడ్డి, డిసెంబర్ 29: మండల కేంద్రానికి చెందిన వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు పేదలకు నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. పలు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా కిరాణా వస్తువులను వారు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ.. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.

సరుకులను పంపిణీ చేస్తున్న వివేకానంద ట్రస్ట్ సభ్యులు

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ

గాంధారి, డిసెంబర్ 29: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో పలువురు దివ్యాంగ చిన్నారులకు డాక్టర్ సారిక ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నరాల బలహీనత, కాళ్లు, చేతులు వంకరగా ఉన్న చిన్నారులతో తాము సూచించిన విధంగా ప్రతిరోజూ వ్యాయామం చేయిస్తే శారీరక వైకల్యం తగ్గుతుందని సూచించారు. శిబిరంలో రిసోర్స్ టీచర్లు పెంటయ్య, సాయన్నతో పాటు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.